... నిలయం
4824
శ్రీకాకుళం

# లక్క బొమ్మలు

"ఈ ప్రపంచంలో, ఆశ్చర్య పడవలసిన వాటిలోకల్లా ఆశ్చర్య కరమైనది మానవ జీవితం''.

ఎప్పుడు చదివానో ఎక్కడ చదివానో బొత్తిగా జ్ఞాపకం లేని ఈ వాక్యం, రాధను తలుచు కొన్నప్పుడల్లా మనస్సులో మెదులుతూ ఉంటుంది. రాధను మీలో ఎవ్వరూ చూసి ఉండరను కొంటాను. చూసే ఉంటే ఆవిడ లోలోపల ఇంత అల్లకల్లోలం ఉంటుందని మీరు అసలే అనుకోరు.

రాధను మొదటి సారిగా రైల్లో గావును చూశాను. మా ఆవిణ్ని నాలుగో సారి కనటానికి పుట్టింటికి పంపేందుకు నాంపల్లి స్టేషను కొచ్చాను. ఆవిడ వెంట ముగ్గురు పిల్లలూ ఉన్నారు. అంతకు ముందుదాకా, నన్ను క్షణం విడిచి ఉండని పెద్దవాడూ, రెండో అమ్మాయీ — తీరా ఆవిడ ప్రయాణ మయ్యేసరికి ఏడుపులు ప్రారంభించారు. వాళ్ళ గుడ్డలన్నీ సంచుల్లో సర్ది స్టేషను కొచ్చి పడిందాకా నాకు బండి అందుతుందనే నమ్మకం లేదు. అదృష్టవశాత్తూ ఆ రోజున బండి రావటమే రెండు గంటలు లేటు. కాబట్టే నేను రాధను చూడ గలిగాను.

అప్పటికి వోణీలు వేసుకో వలసిన అవసరం రాధకు లేకపోయింది. మడిమల పైకి పాటల వర్ణపు పావడా కట్టింది. బిగువైన చొక్కా మోచేతులను తాకుతూ ఉంది. మెళ్ళో సన్నటి గొలుసు. దాచినా దాగని చిరునవ్వు. క్షణం సేపు

నన్ను నేనే మరిచి పోయాను. నా పిల్లలు అరటి పళ్లు తిన డంలో మునిగి పోయారు. వారి భోజన పరాక్రమం చూసి మా ఇంటిది మురిసిపోతూ ఉంది. ఆవిడ మురిపాన్నో పిల్లల ఆబ తిండినోగానీ, రాధ కళ్ళింత చేసుకొని చూస్తోంది. మెల్లగా వొంగి, ప్రక్కనున్న ముసలమ్మ చెవిలో ఏదో చెప్పి ఫక్కున నవ్వింది. అదేదో కానిమాట అయుండాలి. లేక పోతే, ముసలమ్మ కళ్ళురిమి, ముక్కుమీద వేలు వేసుకోదు. అమాటేమిటో అప్పుడూ ఆ తరువాత కూడా నేను రాధను అడగ లేదు.

బండి కూత వేసి బయలు దేరింది. మా ఆవిడ మరో సారి 'జాగ్రత్తగా ఉండండి' అంటూ హెచ్చరించింది. చూస్తుండగానే బండి కదిలి పోయింది.

ఎనిమిదేళ్ళ తరవాత — రెండోసారి విశాఖపట్నం బీచిలో కలుసుకొన్నాను రాధను. అప్పటికీ ఇప్పటికీ ఎక్కడా పోలిక లేదు. శరీరం ఎదగ వలసిన చోటల్లా ఎదిగి, వంపులూ వయ్యారాలూ సంతరించుకొంది. ఇదివరకు కుదించినట్టున్న మెడ సాగి, ముడికి చోటిచ్చి నట్లయింది. ముని వేళ్ళను తాకుతున్న పట్టు చీర జరీ అంచు, గాలికి టపటప లాడు తోంది. ముందుగా తనే చూసిందట. ఆ తరవాత గానీ నేను చూడ లేదుట.

'జ్ఞాపకం ఉన్నానా?' అన్నది రాధ.

'ఉన్నా' నన్నాను.

రాధ ఫక్కున నవ్వింది. ఆ నవ్వులో కొంటెతనం లేదు. అపహాస్యం లేదు. ఏవో పురాతన జ్ఞాపకాల మడ తల్లోంచి వచ్చి నట్లుందా నవ్వు.

'మీ పిల్లలు అసాధ్యులండీ! పాపం ఆవిణ్ని రైల్లో ఎంతేడిపించారనీ! ఓ క్షణం కుదురుగా ఓ చోట కూచో నివ్వలేదనుకోండి. మీ చంటి వెధవను – అన్నట్టు అడగడం మరిచాను. ఇప్పు డెంత మంది పిల్లలు?' అన్నది రాధ.

'ఆరుగురు!'

రాధ కళ్ళల్లో ఇప్పుడు కొంటెతనం చూశాను.

'ఇన్నిటికీ అసలు సంగతి చెప్పనేలేదు. మీ చంటి వాణ్ని నేను ఎత్తుకొన్నాను. లోలకులు లాగి పారేశాడు. చెవి గీరుకు పోయి రక్తం వొచ్చింది. మా బామ్మగా రెత్తుకుంది. ఆవిడ బోడి గుండుతో పది నిమిషాలపాటు ఆడుకుని, మరచెంబు మూతతో ఒక్కటి పెట్టాడు. ఆవిడకి నెత్తురు చిమ్మింది. వాళ్ళమ్మా–ఆవిడ పేరేమిటండీ?' అన్నది రాధ.

పేరు చెప్పాను.

'ఆవిడ నాలుగంటించింది. ఆ దెబ్బతో అలిసి నిద్ర పోయాడు. ఈ సంగతులు మీ ఆవిడ చెప్పి ఉంటుందను కొంటాను! అవునాండీ!' అన్నది రాధ.

ఆ తరువాత తన సంగతి చెప్పింది. వేసవి సెలవులకు విశాఖపట్నం వొచ్చిందట. ఇక్కడ వాళ్ళ వాళ్ళెవళ్ళో ఉన్నారట. తిరిగి కాలేజీ తెరిచిదాకా హైదరాబాదు రాదుట!

'ఏమిటి ఆలోచిస్తున్నారు?' అన్నది రాధ.

'హైదరాబాదును గురించి' అన్నాను.

'మీ కదంటే చాలా ఇష్టమా?' అన్నది రాధ.

ఇంతవరకూ నా కా ప్రశ్న తట్టలేదు. దాని కేమని జవాబు చెప్పడం?

'మీ సంగతి చెప్పండి?' అన్నాను ఏమీ తోచక.

'నాకు చాలా ఇష్టం! ముఖ్యంగా హైదరాబాద్ 'టీ' నాకు అద్భుతంగా ఉంటుంది. ఇంట్లో కాచిన 'టీ' నేను ఛస్తే తాగను. ఇరానీ హోటల్‌నించి తెప్పించుకొంటాను. కానీ— అక్కడి ఎండలంటే నాకు వల్లమాలిన కోపం. చర్మాన్ని పేల్చి పారేస్తుంది. ఇలా జమలూ, ఖర్చులూ వేసుకొంటూ పోతే, ఏది మిగులుతుందో చెప్పలేను గానీ— మొత్తానికి ఇష్టమేనని చెప్పాలి!' అన్నది రాధ.

కనుచీకటి పడింది. సముద్రంలో, దూరంగా ఉన్న ఓడ దీపాలు, నక్షత్ర మండలంలోని 'పిల్లల కోడి'ని జ్ఞాపకం చేశాయి. చల్లని గాలి, ముఖం నిండా కమ్మి, చెవుల్లో రహస్యాలు చెప్పి, కొండరాళ్ళకు కొట్టుకొని రొదలు పెడుతోంది. అలల అంచునుండే నురుగు దొబ్బలు, చీకట్లో మసక మసగ్గా కనపడుతున్నాయి. మాకు అల్లంత దూరంలో, ఇంత కద్దు ఎండ్రకాయ గిట్టలతో దేన్నో నొక్కి పారేస్తోంది.

'పోదాం!' అన్నాను నేను లేవటానికి ప్రయత్నిస్తో.

'అప్పుడే?' అన్నది రాధ.

'వెళ్ళాలి. ఇంకా చాలా పనులు ఉన్నాయి. చీకటి పడింది మీరు కూడా రా గూడదూ?' అన్నాను.

'పదండి మరి!' అంటూ లేచింది రాధ. గాజులు సన్నగా నవ్వినట్లు నిపించింది. రాళ్ళనూ, కసింద మొక్కల్నీ, తప్పించు కొంటూ బాట మీది కొచ్చాం.

'అప్పుడప్పుడు కనిపిస్తుండండేం?' అన్నది రాధ.

నా కెందుకో నవ్వొచ్చింది.

'నేను ఫలానా చోట ఉంటాను. సాయంత్రం సముద్రం వొడ్డున ఉంటాను. ఎప్పుడొచ్చినా సరే!' అన్నది రాధ.

'తప్పకుండా ప్రయత్నిస్తాను.'

అన్నానేగానీ, వారం రోజులదాకా, నాకు కాలు కదప టానికే అవకాశం లేకపోయింది. ఇక్కడి పనులు చూసుకొని తొందరగా బయలుదేరమని, హైదరాబాదునుండి ఉత్తరాలొస్తున్నాయి. కానీ విశాఖపట్నంలో పనులు చప్పున తెమలడం లేదు. లెక్కలన్నీ అయోమయంగా ఉన్నాయి. ఓ పుస్తకం ప్రకారం పదహారు వేలు లాభం కనపడుతుంటే, ఇంకో పుస్తకం ప్రకారం, ఇరవై రెండు వేల చిల్లర నష్టం కనబడుతోంది. ఇదెప్పటికి తేలేట్టు?.

యూనివర్శిటీ రోడ్డంట వస్తున్నప్పుడు, రిక్షాలోపోతూ రాధ మూడోసారి కనిపించింది.

'ఈసారీ నేనే మిమ్మల్ని ముందుగా చూశాను' అన్నది రాధ రిక్షావాడికి డబ్బిచ్చి పంపేస్తూ.

'దిగి పోయ్యారేం?' అన్నాను మర్యాదగా ఉంటుంది గదాని.

'మీతో ఓ ముక్క చెప్పడానికి పెర్మిట్ చేస్తారా?' అన్నది రాధ.

'అది తెలుగు వాక్యం కాదు' అన్నాను నవ్వుతూ.

'పోనిద్దురూ! నేనన్నది మీ కర్థమయినప్పుడు, వాక్యాలను పట్టుకు తన్నుకు చావడ మెందుకు? జాతులకు జాతులే సంకరమై పోతున్నప్పుడు పదాల దగ్గరా మన పేచీ? ఇన్నిటికీ నన్నసలు సంగతి చెప్పనిచ్చారు కాదు. ఏమిటంటే!'

'పెర్మిట్ చేస్తున్నాను'.

'మరి నడవండి! అలా సముద్రం వద్దకు వెడుతూ చెప్పుకొందాం...' అంటూ బయలుదేరింది రాధ.

నేనూ నడక సాగించాను.

'నన్ను 'మీరు' అనకండి. అలా అంటున్నప్పుడల్లా, ఎక్కడలేని వయస్సూ నామీద విరుచుకు పడిపోయినట్లు ఫీలవుతుంటాను. చూడండీ – 'ఫీల్' అన్న మాటను తెలుగులో ఏమంటారు?' అన్నది రాధ.

నిజంగా ఏమంటారో నాకు తెలీదు. కానీ తెలిసినంత వరకూ 'సంవేదన' అంటారని జ్ఞాపకం. ఆ మాటే రాధతో అన్నాను.

'అంటే ఆ మాటకు నే నిలా అనా లన్నమాట. ఏమనీ? – '...ఎక్కడలేని వయస్సూ నా మీద విరుచుకు పడిపోయినట్లు సంబోధన – కాదను కొంటాను. ఏమిటండీ అది?'

'సంవేదన.'

'అదుగదీ–'సంవేదన పడుతుంటాను' అనాలి గావును. పోనీ ఇహానుండీ అలాగే అంటాను' అన్నది రాధ.

రోడ్డు దిగి, కొండరాళ్ళ మధ్య దాక్కున్న బాటలోకి వచ్చాం. ఎర్రటి పూల తీగెలు, కాళ్ళను తాకి దూరంగా తొలిగి పోతున్నాయి. రేవులోంచి స్టీమరు కేక వేసింది.

'మరి–' ఏదో అనాలని ఆగిపోయాను.

'చెప్పండి' అన్నది రాధ వెనక్కు తిరిగి చూడకుండానే!

మనుషుల ముఖాలకేసి చూడకుండా మాట్లాడటం నాకు చాతకాదు.

చెప్పకుండానే సముద్రపు ఇసుకలోకి వచ్చాం. గండ్ర ఇసుక పాదాలను కప్పుతోంది. దూరంగా పెద్దఅల – రాతికి తగిలి ముక్కలయి నురుగులు కక్కుతో విరిగిపోయింది.

'ఇప్పుడు చెబుతాను.'

'ఏది?' అని రాధ అడగలేదు.

'నన్ను మాత్రం 'మీరు' అంటున్నారుగదా మీరు?' అన్నాను.

'ఒక్క వాక్యంలో ఇన్ని 'మీరులు' జోడిస్తే ఏది నాదో, ఏది మీదో తెలీక తికమక పడతాను. అలా చెయ్యకండి. పోతే — మీ పాయింట్ కొస్తున్నాను. తెలుగులో 'బిందువు' అనాలిగావును. అవునాండీ? అయినా 'మీ బిందువు కొస్తున్నాను'అనడం మాత్రం ఏమంత మంచి తెలుగంటారు?' అన్నది రాధ నవ్వుతూ.

'అలా అనడం బావుండని మాట నిజమే! 'అంశం' అనొచ్చుగా మీరు!' అన్నాను.

'కోపం వచ్చిందా?' అన్నది రాధ నవ్వుతూ.

నాకు చిర్రెత్తు కొచ్చిన సంగతి ఇట్టే గ్రహించిందనుకొన్నాను.

'దాచకండి! మీకు నిజంగా కోపం వచ్చింది. ఆ కోపంలో 'మీరు' అనేసి, నన్ను ముసలిదాన్ని చేసి పారేసి సంతృప్తి పడ్డారు. ఇహ మీ సంగతి. కావాలనే మిమ్మల్ని అలా పిలుస్తున్నాను. ఏంచాతంటే మీరు నిజంగా ముసలివాళ్ళు గనక!'

'నేనా?'

'ఆరుగురు బిడ్డల తండ్రి నంటున్నారు, ఇంకా బాల కుమారులంటే ఎలా? జుత్తు సగం నెరిసి పోయింది. కళ్ళ కింద ముడతలు పడుతున్నాయి—'

'నే నొప్పుకోను!' అన్నాను నవ్వుతూ,

'మీ భార్యకూడా వొప్పుకోదు. ఇద్దరూ వయస్సులో సమంగా ఎదుగుతున్నారు. కాబట్టే మీ కాభేదం తెలీదు. మీ కంటి కావిడ ఇప్పటికీ రంభలాగా కనపడుతుంది. ఆవిడ ప్రాణానికి మీరో—'

'కాదు.' అన్నాను నవ్వాపుకోలేక.

'బుకాయించకండి! ఇటువంటి భ్రమే లేకపోతే, మీ రిద్దరూ కలిసి ఇన్ని సంవత్సరాలు కాపరం చెయ్యనూ చెయ్యరు; చేసినా ఆరుగురు పిల్లల్ని కననూ కనరు. ఇవన్నీ జరగడానికి ఇటువంటి భ్రమ తప్పకుండా ఉండాలి. ఏమం టారు?' అన్నది రాధ.

'మీరు మాట్లాడుతుంటే వినాలని ఉంది' అన్నాను చివరికి.

'వెయ్యేళ్ళు బతకండి బాబూ! నేనుత్త వాగుడు కాయనని మా వాళ్ళంతా అస్తమానమూ గీపెడుతుంటారు. నా మాటలు వినలేక చెవులు గడియలు పడుతుంటాయిట. వినాలని బుద్ధిపుడుతుందన్నవారు, ఇంత వరకూ మీరొక్కరే కనిపించారు. అవునుగానండీ—'ఘడియలు' అనాలా? లేకపోతే 'గడియలు' అనాలంటారా?'

ఏమనాలో నేను చెప్పలేదు.

'మాట్లాడరేం?' అన్నది రాధ.

'వింటున్నాను.'

'ఓరి మీ ఇల్లు బంగారం గానూ!' అని నవ్వేసింది రాధ.

రాధను చూస్తుంటే — నాకింకో సంగతి పదేపదే మనస్సులో తిరుగుతూ ఉండేది. కొందరి కొందరికి పూర్వజన్మ

తాలూకు అనుభవాలు, జ్ఞాపకాలు, ఈ జన్మలో కూడా అంటి పెట్టుకొని ఉంటాయిట. రాధలో అటువంటి దేదో జరిగిఉండా లనిపించింది నాకు. రాధ వయస్సుకూ, ఆమె వాగ్ధోరణికీ నాకు లంగరందడం లేదు. వయస్సుకు మించిన అనుభవాలు, పుట్టుకతో వచ్చి ఉండకపోతే — ఈ ప్రవర్తనకు అర్థం చెప్పు కోవడం కష్టమనిపించింది నాకు.

క్షణకాలం నా పాపిష్టి మనస్సులో పాడుకోరిక మెదిలి, మసకలాడి, తప్పుకుపోయింది. వాడెవడు కానీగాక — రాధను చేసుకొనేవాడు చాలా అదృష్టవంతు డవుతాడు. అటువంటి అదృష్టం నాకు లేనందుకు విచారంతో బాటుగా, అవతలివాడి మీద అసూయకూడా కలిగింది. రాధతో అలా కబుర్లు చెబుతూ, రోజులకు, రోజులు గడిపేయడం, ఓ గొప్ప అనుభవం! ఎంతో విశాలమయిన ఆమె వ్యక్తిత్వం, ఆ చిన్న శరీరంలో ఇమడక తక్కిస మక్కిస లాడటం నేను చూడ గలిగాను. అగ్ని పర్వతంలా ఎప్పుడో ఫెటిల్లున బ్రద్దలై, జ్వాలన ద్రవ్యంతో పరిసరాలను ముంచెత్తి, దారుణ దహన క్రియ జరుపుతుందని నాకనిపించింది. ఎందుకలా అనిపించిందని నన్నడగకండి. దానికి కారణాలు నావద్ద సిద్ధంగా లేవు. మీ రడిగినా నేను చెప్పలేను.

నాలుగోసారి నా అంతట నేనే రాధను కలుసుకొన్నాను. పదేపదే కలుసుకొని, ఉన్న గ్లామరును చంపుకోడం నా కిష్టం లేదు. అప్పుడెప్పుడో ఓ సినిమా తాలూకు 'లవ్ సీన్' చూసి, సినిమాలమీదా, 'లవ్' మీద కూడా హితవు పోగొట్టు కొన్నాను. నన్నానందింప జేసేది భ్రమే అయితే, అదే నా క్కావాలిగానీ, పొడిపొడిగా ఉండే నిజం నేను భరించలేను.

నాగభూషణంగారు పనిమాలా నాకు ఫోన్ చేసి, ఆ తరువాత ఇంటికొచ్చారు. ఆయన చెప్పిందాకా, రాధ తండ్రిపేరు నాగభూషణమని నాకు తెలియనే తెలీదు.

'చెప్పండి!' అన్నాను ఆయన మంచి నీళ్ళ గ్లాసందుకొంటూ.

నాగభూషణంగారు అటూ ఇటూ చూసి గొంతు సవరించుకొన్నారు.

ఈగ ముసిరినట్టు మూగిన మా పిల్లల్ని అవతలకు పంపాకగానీ వారు విషయం ఎత్తుకోలేదు.

'మీ రొక్కరే నాకు ఆపద్బాంధవుల్లా కనిపించారు. మీరు చెపితే రాధ తప్పకుండా వింటుంది' అన్నాడు నాగభూషణం.

'నా కా నమ్మకం లేదు' అన్నాను విషయం అర్థం గాక పోయినా.

'అమ్మమ్మా! అలా అనకండి! ఇంతవరకూ మీ దర్శనం చేసుకోలేకపోయి నప్పటికిన్నీ అమ్మాయిద్వారా, కడ ముట్టా తమర్ని గురించి వినే ఉన్నాను. ఈ ఆపత్సమయంలో తమరు చెయ్యూత ఇవ్వకపోతిరా — నన్ను చంపుకుతిన్నట్టే ననుకోండి! కాబట్టి మీరు నాయందు దయవుంచి—'

మనిషి మాంచి లౌకికుడులా ఉన్నాడు. ఎదటి వారిని ఉబ్బేసి పనులు జరుపుకోడంలో చెయ్యితిరిగిన మనిషను కొన్నాను. విషయ మేమిటో చెప్పమని అన్నాను.

నాగభూషణం అంతా చెప్పుకొచ్చాడు. రాధ ఎవర్నో చేసుకుంటా నంటున్నదట. వాడిది ఈ కులంకాదు సరిగదా— ఈ జాతికూడా కాదట. వాడితో మాట్లాడవద్దంటే—ఇంటికే

తీసుకో న్తుందట. ఈ సంగతి నలుగురి నోటా పడితే పరువు పోతుందంటాడు. ఆ పెద్దమనిషి అప్పటికీ ఇంట్లో వాళ్ళందరిచేతా చెప్పించాడట. ఇహ తనవల్లగాక నా దగ్గరి కొచ్చాడట.

'మీరు కాదంటే — ఈ జంఝ్యం తెంపేసి సన్యాసం పుచ్చుకొంటాను' అన్నా డాయన అఖరుకు.

'ఇంతమంది చెప్పినా వినని మనిషి. నేను చెబితే వింటుం దనుకోను' అన్నాను నా అశ క్తతను తెలియబరుస్తూ.

'నా కా నమ్మకముంది బాబూ!' అన్నాడు నాగభూషణం.

మరో సమయంలో అయితే గట్టిగానే సమాధానం చెప్పి ఉందును. కానీ ఆపదలో ఉండి నా దగ్గర కొచ్చాడు. ఇప్పుడు నేనేమన్నా పుండును గెలికినట్లవుతుంది. ఆయన బలవంతాన చివరికి వొప్పుగోక తప్పింది కాదు.

'ఈసారి నేనే నిన్ను ముందుగా చూశాను' అంటూ రాధ గదిలోకి వెళ్ళాను.

'రెండు విధాలా నాకు సంతోషం!' అన్నది రాధ, జడ చివర రిబ్బన్ను బిగించి ముడేస్తూ.

'చెప్పండి!' అన్నాను.

'ఇప్పుడు ఒకందుకే సంతోషం!' అన్నది జడను భుజం మీదుగా వెనక్కు వేసుకొంటూ.

'అదేం?' అన్నాను.

'వస్తూనే 'మీరు' అననందుకు ఒక సంతోషం. మీ అంతట మీరే వచ్చినందుకు రెండో సంతోషం. కానీ వెంటనే 'అండీ' అనేశారు. ఈ దెబ్బతో మొదటి సంతోషం

ఎగిరిపోయింది — పోనీండి గానీ — ఇప్పుడు మీకు పిల్ల లెం దరు?' అన్నది రాధ, ఓ కుర్చీని దగ్గరగా లాక్కుంటూ.

'ఆరుగురు.'

'విశాఖ పట్నంలో ఉన్నప్పుడే ఆరుగు రంటిరిగా? ఈ లోగా ___'

'లేదు.'

'అదేం?' అన్నది రాధ విరగబడి నవ్వుతూ.

'చెట్టుకు కాపుడిగి పోయింది.'

పావుగంట దాకా, రాధ తెళ్ళుకు తెళ్ళుకు నవ్వు తూనే ఉంది.

'మీ రొచ్చిన పని చెబితే అలా ఎటన్నా పోదాం!' అన్నది రాధ.

ఎలా మొదలు పెట్టాలో తోచ లేదు. అదీగాక నా కర్మ కాలిపోతే, ఈ దిక్కుమాలిన రాయబారం నా నెత్తిన పడట మేమిటి? భూషణంగారు అడక్కుండా ఉన్నట్లయితే, ఎలా ఉండేదో చెప్పలేను. అప్పుడు నేనే 'ఈ పని తగదమ్మా' అని సలహా ఇద్దును. ఆయన చెప్పేసరికి — ఆ సంకల్పమే మారిపోయింది.

రాధ తన ఉద్దేశం చెప్పేసింది.

'అదంత మంచిది కాదనుకొంటాను' అన్నాను.

'ఎంచేత?' అన్నట్లు కళ్లెగ రేసింది రాధ.

'ఊహాకూ, బ్రతుకుకూ మధ్య వంతెన లేకపోవడమే కారణ మనిపిస్తుంది నాకు. ఎవ్వరో, ఎప్పుడో, ఎందుకో, ఛటుక్కున మనల్ని ఆకర్షిస్తారు. మనస్సుమీద గట్టిముద్రలు పడతాయి. అంతమాత్రాన అదేపట్టుకు పాకులాడటంలో

వివేకం ఉంటుందనుకోను. ఎంత అందంగా ఉన్నా కల కలే! వాస్తవం వాస్తవమే! అవునా?' అన్నాను.

'కాదనడానికి మీరు అబద్ధం చెబితే గదా!' అన్నది రాధ.

ఆ మాట లంటున్నప్పటి రాధ రూపం నన్ను నిలువునా ముగ్ధుణ్ని చేసింది. ప్రళయంగా పొంగి, గట్లను తోసుకు రాబోతున్న మహాప్రవాహం నాకు రాధలో కనిపించింది. పచ్చని చర్మం అడుగున రక్తంచేసే కల్లోలాన్ని నేను అర్థం చేసుకో గలిగాను.

'దేశపాండేను చేసుకోడానికి, మీరు చెప్పిందానికి మధ్య నాకు వంతెన కనపడలేదు' అన్నది రాధ, 'వంతెన' అన్న చోట నొక్కుతూ.

ఓ క్షణంపాటు నాకంతా అయోమయంగా కనిపించింది. విషయాలన్నీ కలగాపులగమయి, చిక్కు పడిపోయాయి. కాస్సేపు ఆలోచించాక గానీ, దారపుకొస చేతికందలేదు.

'అదే చెబుతూంట' అన్నాను 'నువ్వెక్కడ పొరపడుతున్నావంటే?'—

'అసలు నేను పొరపడం చే?' అన్నది రాధ. ఇక నేను మాట్లాడటం అనవసరమనిపించింది.

'పోతాను' అంటూ లేచాను.

'కూచోండి. మీతో మాట్లాడి చాలా కాల మైంది. మనస్సు చిరాగ్గా ఉన్నప్పు డల్లా మీరు జ్ఞాపకాని కొస్తుంటారు.

'మరి కలుసుకోలేదేం?' అన్నాను.

'మనస్సు చిరాగ్గా ఉండొద్దుటండీ! ఉత్తినే కలుసుకోడం దేనికీ?' అన్నది రాధ నిండుగా నవ్వుతూ.

'ఈ పూట చిరాగ్గా ఉందా?' అన్నాను.

'ఉంది. మీరొస్తే బావుండునని కూడా అనుకొన్నాను. మీరే వచ్చారు. మా వాళ్ళంతా కలిసి, నాతల్లో కంది కీగల్ని పెట్టేశారనుకోండి. ఈ గొడవలు పడలేక—'

'ఏం చేదామనుకొన్నావు?' అన్నాను.

రాధ ఓ క్షణంపాటు నన్ను చూపులతో తడిమి, క్రింది పెదవి మునిపంట కొరుకుతూ, రెండు కాళ్లూ కదుపుతూ ఉండిపోయింది.

'దేశపాండేతో లేచిపోదా మనుకొన్నాను' అన్నది పెద్దగా.

ఇటువంటి సమాధానం వస్తుందని నాకు ముందే తెలుసు గనక ఉలిక్కి పడలేదు.

'ఉద్దేశం మంచిదేగాని, నువ్వెందరి తలల్లో కందికీగలు పెట్టావో ఆలోచించవేం? నీ గొడవ పడలేక మిగతా వాళ్ళందరూ ఎవరితో లేచిపోవాలంటావ్?' అన్నాను.

రాధ సన్నగా నవ్వింది. కానీ అది నవ్వులాగా లేదు.

'నా కిక్కడే మనుషులు అర్థం కాకుండా పోతున్నారు. ఎవణ్నో ఒకణ్ని చేసుకోక తప్పదన్నప్పుడు, నేను దేశపాండేను చేసుకొంటే మాత్ర మేమని నా ప్రశ్న? దానికి సరిగ్గా ఒక్కరూ సమాధానం చెప్పరు. చెప్పే జవాబులన్నీ డొంకతిరుగుడుగా ఉంటాయి. నా కిష్టమైన జతను నేను ఎన్నుకోడం కూడా తప్పే అయితే, ఇంక 'నేను' అనేది ఏ విషయంలో మిగిలిందో నాకు బోధపడ్డంలేదు. ఈ దిక్కు

మాలిన విధానాలే లేకపోతే మానవుడు ఇంకా ముందుకు వెళ్ళే వాడనుకొంటాను' అన్నది రాధ.

'నేనలా అనుకోను. మానవ సమాజం ఈ ప్రయోగా లన్నీ ఇదివరకు చేసింది. ఇప్పుడిక్కడఉంది. అంటే_ఇందులో లోపాలు లేవని కాదు. ఉన్నాయని, ఈ వ్యవస్థనే ఛిద్రం చెయ్యడంలో అర్థంలేదు. గాలిలో కోటానుకోట్ల రోగ క్రిములున్నాయని, గాలి పీల్చకుండా మానుకోడం లేదు. క్రిములుంటే తోలగిస్తాం. అంతేగానీ_ గాలినే నిర్మూలించం.'

'ఆ క్రిములు గాలిని చెడగొట్టేంతగా ఉన్నప్పుడేమంటారు?' అన్నది రాధ.

'బ్రతకడం ముఖ్యమనుకొన్నప్పుడు ఏదో ఓ గాలి పీల్చవలసిందే!' అన్నాను కసిగా.

'ముఖ్యం కానప్పుడో?'

నాకిక ఓపిక లేకపోయింది. ఆ విషయాన్ని గురించి మాట్లాడ్డం మానేద్దామన్నాను. రాధకూడా అందుకు ఒప్పుకొంది. ఇద్దరం కలిసి, గోల్కొండను గురించీ, చార్‌మినార్‌ను గురించీ కాస్సేపు మాట్లాడుకొన్నాం. ఉద్రేకంనుండి రాధ చప్పున తేరుకొంది. నాకు చాలాసేపు పట్టింది.

నాగభూషణంగారు చాటునుండి అంతా వింటున్నారు గనక వేరే చెప్పవలసిన అవసరం లేకపోయింది.

'విన్నాను బాబూ! విన్నాను!!' అన్నాడాయన ఖండువాతో కళ్ళొత్తుకొంటూ.

మరో వారం రోజులకల్లా రాధ లేచిపోయిందని విన్నాను.

నాకు నాగభూషణం మీద చెడ్డకోపం వొచ్చింది. లేచి పోయిందన్న అపకీర్తికన్నా వాళ్ళిద్దరికీ పెళ్ళిచేస్తే వచ్చే అపకీర్తి ఎక్కువదేం కాదు. నిజంగా నాగభూషణం తెలివిగలవాడే అయితే, ఈ పెళ్ళిని ఆర్భాటంగాచేసి, 'సంస్కర్త' అన్న పేరు సంపాదించి ఉండవలసింది. ఏమాత్రం లౌకికం తెలిసినవాడి కయినా ఈ ఆలోచన తడుతుంది మరి!

నాగభూషణాని కయినా ఈ ఆలోచన అసలే రాలేదనుకోవడం న్యాయం కాదనుకొంటాను. ఆలోచననేది వచ్చినా, అంతకు మించిన సామాజిక వత్తిడులు అతన్ని అణచిపెట్టి ఉండాలి. శిథిలమయి పోతున్న హైందవాచారాలను చూస్తుంటే ఒక్కోసారి జాలివేస్తుంది. నాగభూషణాన్ని చూస్తే మాత్రం నాకు జాలి కలగలేదు.

ఆరు మాసాల తరువాత మద్రాసులో కలుసుకొన్నాను రాధను. ఈసారీ ఆవిడే నన్ను గుర్తుపట్టింది. పక్కనే దేశపాండే ఉన్నాడు. నేను టాక్సీదగ్గర కెళ్ళేలోగా వారే నా కెదురువచ్చారు.

'ఎప్పు డొచ్చారు?' అన్నాడు దేశపాండే ఇంగ్లీషులో.

'ఉదయం' అన్నాను ముక్తసరిగా.

రాధ ఓ క్షణం నన్ను పరకాయించి చూసింది.

'మిమ్మల్నెలా పోల్చుకొన్నానో చెప్పనా?' అన్నది రాధ.

'చెప్పు!'

'అయితే టాక్సీలో కూచోండి. తీరిగ్గా చెబుతాను' అంటూ తనువెళ్ళి దేశపాండే పక్కన కూచుంది.

'మీరు పదండి. నేను పని చూచుకు వస్తాను' అని అందామనుకొన్నాను. కానీ, ఏదో అడ్డుపడి మాటలు రాలేదు.

టాక్సీ ఫ్లవర్ బజారు పోలీసుస్టేషను ముందుగా, పారిస్ కార్నరు కేసి వెడుతోంది.

'చెప్పూమరి!' అన్నాను రాధ మౌనంగా ఉండటం చూచి.

'చెబితే, ఆ వొక్కముక్కా చెవినేసుకుని వెళ్ళిపోతా రేమోనని నా భయం. ఈ పూట మా ఇంటికొస్తానంటే చెబుతాను' అన్నది రాధ నవ్వుతూ.

దేశపాండేకు ఈ సంభాషణ అర్థంకాకపోవడం మూలాన్ని పేపరు చదువుకొంటున్నాడు.

రాధను అర్థం చేసుకునేందుకు మరోసారి ప్రయత్నిం చాను. రానురాను ఆవిడ నాకు అర్థంకాకుండా పోతున్న దనిపించింది. చిన్నపిల్లలను కాయంకోసం ఊరించినట్లుగా ఊరించి మనుషులను తన వెంటపడేలా చేసుకోవడం — రాధ కెలాగో చాతనవును. ఇంత అనుభవముఉన్న నేనే రాధ చెబుతానన్న కారణంకోసం, పని మానుకొని ఆవిడతో బాటు టాక్సీలో కూచున్నాను అంటే — నా అనుభవం రాధ శక్తి ముందు ఎందుకూ కొరగాలేదన్నమాటే! ఆ క్షణాన రాధ కళ్ళల్లో నేను విజయం పొందిన సంతృప్తిని చూడగలిగాను. ఇటువంటి దేదో దేశపాండేకుకూడా కలిగి ఉంటుంది. లేక పోతే అత నీ పెళ్ళికి వొప్పుకొని ఉండేవాడు కాదనిపించింది నాకు.

'ఏమి టాలోచిస్తున్నారు?' అన్నది రాధ.

నే నాలోచిస్తున్నదంతా చెప్పేసి రాధ సిగ్గుపడేలా చేదామనుకొన్నాను. కానీ చెయ్యలేక పోయాను.

ముగ్గురం మెరీనా దగ్గర టాక్సీ దిగి, ఇసకలో నడుస్తున్నాం.

'అప్పటికీ ఇప్పటికీ నాకు సముద్రమంటే వల్లమాలిన ఇష్టం!' అన్నది రాధ చెంపలమీద పడుతున్న వెంట్రుకలను సుతారంగా చెవుల ప్రక్కకు నెడుతూ.

'ఏంచేత?' అన్నాను, ఏదో అనాలి గనక.

'వంతెనలు ఉండవు గనక!' అన్నది రాధ.

అని ఛటాలున నాకేసి తిరిగి నవ్వడం మొదలెట్టింది. దేశపాండే ముఖంలో కొంత చిరాకు కనిపించింది నాకు. నీళ్ళ దగ్గరగా వచ్చి కూచున్నాం.

'ఇప్పుడు చెబుతాను' అంటూ ఇసకలో కూచుంది రాధ. ఆవిడకు అల్లంత దూరంలో దేశపాండే కూచున్నాడు. దూరంగా చేపల పడవలు అలలమీద ఎగసి పడుతున్నాయి.

'చెప్పనా? మరేమీ అనుకోకుగదా?' అని నవ్వ సాగింది రాధ.

కాస్సేపు చెక్కిళ్ళు కందేలాగా నవ్వింది. అతిగా నవ్వడం వల్లనేమో ఆమె కళ్ళు నీటితో తడిశాయి. తడికళ్ళను పైటతో వొత్తుకొంటూ మరోసారి నవ్వి, తేరుకొని, గొంతు సవరించుకొన్నది రాధ.

'ఎంత నెరవున్న పంచెనైనా మోకాళ్ళకిందికి కట్టగల వాళ్ళు మీరొక్కరే! అంచాతే మిమ్మల్ని సులభంగా పోల్చుకోగలిగాను. కారణం చెప్పేశాను గదాని ఇంటికి

రావడం మానుకోనేరు. తప్పకుండా రండి! రాకపోయారో మీతో మాట్లాడ్డం మానేస్తాను'.

రాధ మాట్లాడ్డం మానివేయడమంటే—ఏదో లోటుగా అనిపించింది నాకు. తప్పకుండా వస్తా నన్నాను. అనడమే కాదు. అలాగే వారింటి కెళ్ళాను కూడాను.

మద్రాసులో ఉన్న వారం రోజులూ నా మకాం అక్కడే! ఈ వారం రోజుల్లో రాధ నిత్యజీవితానికి మరింత సన్నిహితమయ్యే అవకాశం నాకు లభించింది. దేశపాండే ఏదో ప్రైవేటు కంపెనీలో నెలకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నాడు. అయినా రాధ మరేదో కంపెనీలో ఉద్యోగం చేస్తోంది.

'ఇదేమిటి!' అడిగానోసారి.

'రొటీన్నుండి కొంత మార్పు ఉండాలని' అన్నది రాధ. 'ఇరవై నాలుగ్గంటలూ, ఈ గోడలు, కుర్చీలు, పటాలు, పుస్తకాలు, గిన్నెలు, వంటసామాను, నౌకర్లనూ, చూస్తూకూచోవడం ఎంత బాధో ఆలోచించండి! కొత్తదనం తాలూకు థ్రిల్ కొద్ది రోజులే ఉంటుంది. రాను రాను పాతబడి చాలా సాదాగా అనిపిస్తుంది మనస్సుకు, అందుకే నేను ఉద్యోగం చేస్తున్నాను.'

'ఏ ఉద్యోగమయినా రొటీన్ కాక తప్పదనుకొంటాను. అవే బల్లలు, కుర్చీలు, కాయితాలు, అంకెలు, ఫైళ్ళు, మనుషులు — అన్నీ పాతవే. నీక్కావలసిన రిలీఫ్ ఇందులోమాత్రం ఉంటుందా మరి?' అన్నాను.

'ఉండదు గనకనే నేనే ఉద్యోగాన్ని అంటి పెట్టుకో లేక పోతున్నాను. ఈ ఆరుమాసాల్లోనూ రెండు ఉద్యోగాలు చేశాను' అన్నది రాధ బద్ధకంగా ఆవులిస్తూ,

'ఇలా అయితే — కొంత కాలానికి నువ్వు చెయ్యడానికి ఉద్యోగాలే దొరక్కపోవచ్చు. అప్పు డెలా మరి?'

'అంత ప్రమాదం జరగదేమో?' అని రాధ కింద పెదవిని సుతారంగా విరుస్తూ—

'అప్పటికి మళ్ళీ పాత ఉద్యోగంమీద మళ్ళీ మోజు కలిగే అవకాశం ఉందిగా!'

'ఉందిగానీ, ఆ ఉద్యోగం మళ్ళీ నీకు దొరకొద్దూ?'

రాధ మాట్లాడలేదు. బహుశా దొరుకుతుందని లోలోపల అనుకొని ఉండవచ్చు. అదృష్టవశాత్తూ దొరక వచ్చు కూడాను. ఏం చెప్పగలం?

అనగూడదు గానీ — రాధ సుఖంగా ఉండటం నా కెందుకో గిట్టలేదు. దేశపాండేతో లేచిపోయిన తరవాత, ఆవిడ బాధలు పడి ఉండవలసింది. నా ముందు పశ్చాత్తాప పడి ఉండవలసింది. అలా చేసినట్లయితే, నా సానుభూతి రాధకు లభించి ఉండేది. నా సానుభూతి లేకపోవడమన్న లోటు తప్పితే, రాధకు మరో లోటున్నట్లు నాకు కనిపించ లేదు. లేచిపోయిన వారంతా ఇంత సుఖంగా, ఉండే పక్షంలో, పెళ్ళాడటం కన్నా ఆ పనే చెయ్యడం బావుం టుందనిపించింది. కాని అన్నిచోట్లా అలా ఉండటంలేదు గదా మరి?

ఇది జరిగిన ఏడెనిమిది మాసాలకు రాధ నాకు జాబు రాసింది. అదే ఆమెనుండి అందుకొన్న మొట్టమొదటి

ఉత్తరం. ఆ ఉత్తరం మొత్తం చదివాక, రాధ మరింత
అయోమయంగా తయారయింది. ఆవిడ బొమ్మ, చెదిరిపోయి
కలగాపులగమయింది. తను సుఖంగానే ఉందట. కానీ తను
సుఖపడకుండా కొన్ని శక్తులు పనిచేస్తున్నాయిట. ప్రస్తుతం
ఆ శక్తులతో తను హోరాహోరీగా పోరాడుతున్నదట. ఇంత
వరకూ జయాపజయాలు తేలలేదట. తేలిన తరువాత మళ్ళీ
ఉత్తరం రాస్తా నన్నది. ఈ జాబు అందినట్టు తెలియచేయ
మన్నది.

ఆ మర్నాడో, మూడో నాడో దేశపాండేనుండి ఉత్త
రం వచ్చింది. అతనంటున్న దానిబట్టి చూస్తే చాలా పశ్చా
త్తాప పడినట్లు కనిపిస్తోంది. దానికి కారణాలు కూడా అతను
రాశాడు.

'నా సంపాదన తక్కువేం కాదు. రాధ ప్రత్యేకంగా
ఉద్యోగం చేసి సంపాదించ నవసరంలేదు. ఈ మాట చాలా
సార్లు ఆవిడతో చెప్పాను. అయినా రాధ వినలేదు. నేను
పాతమనిషిని కాను. ఆడవాళ్ళను బందీలుగా ఉంచాలన్న
అభిమతం కూడా నాకు లేదు. కానీ బ్రతకడం తెలియా
లంటాను. ఇందులో తప్పులేదే! మొన్ననూ — ఆఫీసు
మేనేజరు ఆవిణ్ణి గదిలోకి పిలిచి, కబుర్లలో పెట్టి అందరూ
వెళ్ళిందాకా ఉంచాట్ట. ఆ తరువాత చెయ్యి పట్టుకొన్నాట్ట!
తను వచ్చేసిందట. ఈ సంగతి — నాతో చెప్పకుండానే ఉండ
వలసింది. చెప్పాక వాడిమీద యాక్షన్ తీసుకొంటానంటే
వద్దంటుంది. 'పోన్లెండి పాపం!' అంటుంది. 'తెలీక చేశా
డులే.' అంటుంది. నా కెలా ఉండాలో ఆలోచించండి.
అంత సానుభూతి ఉన్నావిడ — పోనీ నాతో అనకుండా ఉండ

లేక పోయిందా? 'ఎందుకు చెప్పా'వంటే 'చెప్పకుండా మిమ్మల్ని మోసగించనా?' అంటుంది. ఈవిడ నాకు, రాను రాను అర్థం కాకుండా పోతోంది. ఈ పంపిణీమీద ఆలోచిస్తే రాధ ఎక్కడ తేలుతుందో చెప్పలేను. మీరూ, నేనూ కలుసుకొన్నది ఒక్కసారే అయినా, మీ గురించి రాధ చాలా సార్లు చెప్పింది. ఆవిడ మాటలను బట్టి మీ రావిడకు చాలా సన్నిహితులని నే నర్థం చేసుకొన్నాను. దయచేసి వెంటనే జవాబు రాయండి' అని ముగించాడు దేశపాండే!

బాగానే ఉందిగానీ, ఇందులో నా సలహా కావాలో అవసరం లేదో దేశపాండే రాయలేదు. 'జవాబు రాయండి' అని మాత్రమే అన్నాడు. ఏమని రాయడం? ఒకవేళ సలహాయే అడిగి ఉంటే ఏమని రాసిఉండేవాణ్ణో నేను చెప్పలేను. రాధను విడిచెయ్యమనేవాణ్ణా? ఆ ముక్క రాసి నన్ను నేనే క్షమించుకోలేను. పోనీ అలాగే సరిపెట్టుకోమనేవాణ్ణా? నేనయితే సరిపెట్టుకోను. సరిపెట్టుకోలేనుకూడా! నేను చెయ్యలేని పనిని మరొకరు చెయ్యాలని ఎప్పుడూ నే ననను. అది నా స్వభావానికే విరుద్ధం.

రెండు మాసాల తరవాత రాధనుండి మరో జాబు నందుకొన్నాను. ఆ ఉత్తరంనిండా విషాదమే కనిపించింది నాకు.

'...ఏదో అనుకొంటాం. అనుకొని చేస్తాం. అనుకొన్నప్పుడూ, చేసినప్పుడూ, ఆ పని చాలా ఆనందంగా ఉంటుంది. కానీ, దాని ఫలితం విషాదమయినప్పుడు కలిగే బాధ — బొత్తిగా భరించరానిది. ఊహకూ, బ్రతుకూ — మధ్య వంతెన ఉండాలని మీ రప్పు డెప్పుడో అన్నారు. దానికి నే నేమని జవాబు చెప్పానో జ్ఞాపకం లేదు. అసలు

చెప్పానో లేదో కూడా నాకు తెలియదు. కానీ ఇప్పటి పరిస్థితులు, నన్ను వంతెనమీదకు నెడుతున్నాయి. కావలసిందేదో చేతికిచిక్కిందనుకొన్నాను. అయితే చిక్కింది నాక్కావలసింది కాదని తెలిసినప్పుడు, ఏడిచే వోపికకూడా నాకు లేకుండా పోయింది. లోకమంతా నాకు శత్రుస్థానంలో ఉన్నదనీ, నా సుఖాన్ని శక్తికొద్దీ హరించి పారేస్తున్నదనీ నా నమ్మకం. ఇది నిజమే ననుకొంటున్నాను. నిజమేనని గట్టిగా కూడా అనలేకపోతున్నాను. ఎందుకంటే — నేను సత్యమని నమ్మినవన్నీ, నా కళ్ళెదటనే, విరిగి కరిగి, ఆవిరిలెత్తి పోతున్నాయి. ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో తెలీకుండా ఉంది. కొందరు — కొన్నింటిని గట్టిగా నమ్మేసి, నిశ్చింతగా సుఖపడతారు. సుఖపడుతున్నారు. నాకటువంటి సదుపాయం లేకుండా పోయింది. ఎందుకనో తెలీదు. మరోసారి రాకూడదూ? ఎంచాలో మిమ్మల్ని చూడాలని పదేపదే మనస్సు ఆరాట పడుతోంది. ఓసారి రండి— ఉంటాను' అని రాసింది రాధ. ఉత్తరం చివరన 'అన్నట్టు అడగటం మరిచాను. ఇప్పుడు మీకు పిల్లలెంతమంది!' అని రాసి ముగించింది.

ఉత్తరం చదువుతున్నంతసేపూ, రాధ ముసలి రూపం నా కళ్ళముందు మెదిలితే, ఆఖరి వాక్యంలో ఆవిడ చిన్నతనం తొంగి చూసింది. ఈ రెండు రూపాల మధ్య గల వంతెన, ఆవిడ దేశపాండేతో లేచిపోవడం. ఆ వంతెన కట్టుదిట్టంగా లేదనిపించింది నాకు. కంట్రాక్టరుకు అనుభవమన్నా లేకపోవాలి. లేదా, అధికారులకు లంచంపెట్టి, కళ్ళల్లో దుమ్మన్నా కొట్టిఉండాలి. ఈ రెండింటిలోను ఏ కారణమైనా ఫలితం ఒక్కటే?

నాకూ ఓసారి రాధను చూడాలనిపించింది. ఆవిడ ఇబ్బందుల్లో ఉండటం చూసి సంతోషపడాలన్న వాంఛ, నాలో ఎక్కడో ఉండిఉండాలి. అది కారణంగానే సెలవు పెట్టి మద్రాసు చేరుకొన్నాను.

నా కోసం రాధ స్టేషను కొస్తుందనుకొన్నాను. ఆవిడ కోసం ప్లాట్ ఫారమంతా వెదికాను. దేశపాండే కనిపించాడు. భౌతికంగా అతనిలో ఏ మార్పూలేదు. కాని కళ్ళల్లో దైన్యం దోబూచు లాడుతోంది. అంతర్గత వేదనను కళ్ళు దాచలేక పోవడం ఎంత దురదృష్టం!

'రండి రండి! మీ కోసం థరుడుక్లాసు పెట్టెల్ని వెదుకు తున్నాను. రాధ ఆ పెట్టెలే వెదకమని కూడా చెప్పింది' అన్నాడు దేశపాండే, నవ్వుతూ చేతిని చాపి.

ఆ చేతిని ముట్టుకొన్నాను. చల్లగా, నిర్జీవంగా ఉన్న దనిపించింది నాకు. ఇంటిదాకా ఎవ్వరం మాట్లాడలేదు. ఈ వ్యవధిలో నేను దేశపాండేను గురించి ఆలోచించసాగాను. అతనిలో కూడా ఏదో మార్పు వచ్చినట్లనిపించింది. రాధ చెప్పింది గనక మూడో తరగతిపెట్టె వెదికాట్ట! అంటే— రాధ ప్రభావంనుండి కథానాయకు డింకా బయట పడలేదన్న మాటే!

'బావున్నారా?' అన్నది రాధ, నన్ను చూస్తూనే.

ఈ ప్రశ్నతో మా సంభాషణం ప్రారంభ మయిన జ్ఞాపకం నాకు లేదు.

'ఓ' అన్నాను.

నన్ను దింపేసి దేశపాండే వెళ్ళిపోయాడు. అతను వెళ్ళాక 'ఎలాఉన్నా' వని అడిగాను.

'ఇలా!' అన్నది రాధ చాలా చప్పగా.

మనిషి రంగు మారింది. కళ్ళకింద సన్నని ముడతలు మేలు కొంటున్నాయి. పెదవులు నల్లబడ్డాయి. చెక్కిళ్ళ మీాది నెవళం తగ్గిపోయింది. కళ్ళల్లో మునుపటి ఉజ్జ్వలకాంతు ల్లేవు. పొట్ట ఎత్తుగా వుంది. నానించి దాన్ని దాచడంకోసం, పమిటను, అటూ ఇటూ లాగి, కుచ్చిళ్ళు సవరించు కొంది.

'ఇదెప్పుడు?' అన్నాను నవ్వు నాపుకొంటూ.

ఎప్పుడో చెప్పలేదుగానీ, తనూ నవ్వింది. ఇదివరకు నవ్వినప్పుడు, బుగ్గలు సన్నగా గుంటమిపడేవి. ఇప్పుడు, ముక్కు పక్కగా, అటూ ఇటూ రెండు గీతలు మాత్రం కనిపించాయి.

రాధ చాలాసేపు మాట్లాడలేదు. నే నక్కడున్నా, లేనట్లే ఎటో చూస్తోంది.

'ఏదన్నా కబుర్లు చెప్పు. నిశ్శబ్దాన్ని నేను భరించ లేకుండా ఉన్నాను' అన్నాను.

కబుర్లంటే నాకు చిరాకు. నిశ్శబ్దంగా ఉండటమంటే ఎంతో హాయిగా ఉంటుం దిప్పుడు' అన్నది రాధ.

'అదేం?'

రాధ పలక లేదు.

'నువ్వు రమన్నావనే వచ్చాను. ఎందుకు?' అన్నాను.

'ఎందుకూ లేదు. మీారు దూరంగా ఉన్నప్పుడు ఎన్నో సంగతులు మాట్లాడాలను కొన్నాను. ఉత్తరం వ్రాసాను. మీారు వస్తారని నాకు తెలుసు—

'మీారు బయలు దేరినప్పణ్నించి, ఒక్కో సంగతే మరు గున పడిపోతూ వచ్చింది,' అన్నది రాధ.

'చెప్పదగిన వేవీ లేనేలేవా?' అన్నాను.

'ఉన్నాయి. కానీవాటిని మాటల్లో పొదగడం నాకు చేత కావడంలేదు. నాలో ఏదో చెడిపోయిందనుకొంటాను' అన్నది రాధ.

నే నేమీ అనలేదు.

కాస్సేపుండి రాధ కళ్ళనిండా నీరు పెట్టుకుంది.

'నే నోడిపోయాను. ఓడిపోయాను. నాక్కావలసింది దొరకలేదు' అని భోరుమని ఏడ్చింది రాధ.

'అది సరి కాదనుకొంటాను' అన్నాను. 'లోకంలో నీకన్నా దురదృష్టవంతు లున్నారు. కావలసినవాణ్ని చేసుకొన్నావు. అందర్నీ ఎదిరించి జయించావు. డబ్బుపరంగా నీ కేలోటూ లేదు. ఇప్పటికీ దేశపాండే నువ్వంటే ప్రాణాలు విడుస్తున్నాడు. నువ్వు చెప్పావటగా — నేను మూడో తరగతి పెట్టెలోగానీ రానని! అందుకని ఆ పెట్టెలన్నీ వెదుకుతున్నాట్ట, తనే చెప్పాడు. భార్య మాట, అంత 'తు. చ.' తప్పని మొగుణ్ని నేను చూడలేదు. ఈ ఒక్క అంశం చూసుకొని నువ్వు గర్వపడ వచ్చునే!'

రాధ బరువుగా నిట్టూర్చి చప్పరించేసింది.

'నేను అసహ్యించుకొంటున్నదే అదీ.' అన్నది రాధ. 'దాన్నిచూచి మీరు గర్వపడమంటున్నారు. నేను చెప్పినట్లల్లా వింటాడు. చెయ్యమన్న దల్లా చేస్తాడు.'

'మరింకేం?' అన్నాను.

'చాలా ఉంది!' అన్నది రాధ విసుగ్గా కుర్చీలో అటూ ఇటూ కదులుతూ. 'అంతా నా ఇష్టమే అయితే—ఇక 'దేశపాండే' అన్న మనిషెక్కడున్నాడో నాకు బోధపడటంలేదు.

'కూరలు, గుడ్డలు, నౌకర్లు, డబ్బు, ఇల్లు, కారు, సొమ్ములు, సినిమాలు – అన్నీ నా ఇష్టమేనా? దేశపాండేకు వీటిల్లో సొంత ఇష్టాయిష్టాలు లేనే లేవా?'

'ఉండక పోవచ్చు.'

'ఉండకపోతే అతనేం మనిషండీ? నాలో నేనే కాపరం చేసుకోనామరి? ఇప్పటి మనిషికంటే – నాకు పూర్వపు దేశపాండే బాగా నచ్చాడు. నేను ఏమనుకుంటానోనన్న అనుమానం కూడా లేకుండా నిర్భయంగా అనదలచిందేదో అనేసేవాడు. ఇప్పటి వ్యక్తి ఉత్త రబ్బరు బొమ్మ. ఎటు వొంచితే అటు వొంగుతున్నాడు. ఈ రబ్బరు బొమ్మతో ఎలా ఉండను?' అన్నది రాధ.

ఆమె కళ్ళు ఎర్రపడ్డాయి, నుదురుమీద చిరుచెమట పోసి, సాయంత్రపు ఎండకు నుదురంతా జరీపట్టీలా మిలమిల లాడుతోంది.

'ఎందుకలా నవ్వుకొంటారు?' అన్నది రాధ, అప్రయత్నంగా తనూ నవ్వుతూ.

'నిన్ను చూసే!' అనేశాను.

రాధ మాట్లాడలేదు.

'లోగడ నువ్వు రాసిన ఉత్తరాలు నాకింకా జ్ఞాపకం ఉన్నాయి. దేశపాండే నీ వ్యక్తిత్వాన్ని చంపుతున్నాడని ఆరోపించావు. పోరాటం జరుగుతున్నదనీ జయాపజయాలింకా తేలలేదనీ రాశావు. అతను నిన్ను కాదన్నప్పుడూ, బాధ పడ్డావు. అనుసరిస్తున్నప్పుడూ బాధ పడుతున్నావు. అతను పూర్తిగా వోడిపోయాడు గదా! ఇంకెందుకీ విచారం నీకు?' అన్నాను.

'నేనే ఓడిపోయాను గనక' అన్నది రాధ.

'అదెలా ?' అన్నాను.

'అంతే !' అన్నది రాధ. 'ఓడిపోయినట్లు నటించి నాకు మనశ్శాంతి లేకుండాచేశాడు. తనుమాత్రం హాయిగా ఉన్నాడు.'

'నీతోబాటు అతనూ ఏడవటల్లేదనేనా నీ బాధ?' అన్నాను.

రాధ మరోసారి కుర్చీలో మసిలి 'కావచ్చు' అన్నది నిట్టూర్చి.

నాకు మాత్రం అదే నిజమనిపించింది. రాధ తనంత తానుగా సుఖపడలేదు. మరొకరు బాధ పడుతుంటేతప్ప— ఆ బాధతో తను పోల్చుకుంటే తప్ప, సుఖించలేదు. ఆవిడ కోరుకొన్నవన్నీ లభించాయి. కానీ విచారం మాన్పుకోలేక పోయింది.

'అవునుగానీ, నీ కొడుక్కేమని పేరు పెడతావు ?' అని నేనే విషయాన్ని మార్చేశాను.

'వంశీ' అన్నది రాధ నవ్వి. 'కూతురయితే ఏ పేరు పెట్టమంటారు ?'

'వంశీనే!' అన్నాను నేను.

'చూడంగానే నన్ను మీరు గుర్తుపట్టగలిగారా ?' అన్నది రాధ.

ఆ ప్రశ్న వెనక ఆవిడ మనస్సులో ఏమి జరిగిందో నే నూహించగలిగాను.

'లేదు.' అన్నాను.

'అందుకే ముందుగా నేనే పలకరించాను. మనిషి మారినంత తొందరగా కంఠస్వరం మారదు కదండీ ?'

'మారుతుంది!' అన్నాను అది అబద్ధమని తెలిసికూడా.

'నే నన్నదల్లా కాదనడమే పనిగా పెట్టుకొన్నారను కొంటాను!'

'కాదు.' అన్నాను మళ్ళీ.

ఇదివరకులాగా రాధ సముద్రపొడ్డుకు షికార్లు వెళ్ళడం లేదు. 'ఎందు' కని అడిగాను. మొగం మొత్తింది అన్నది నవ్వుతూ. 'అందుకనే ఋషులు జన్మరాహిత్యం కోరుకొంటా రేమో?' అన్నది. 'కావచ్చు' నన్నాను.

ఆ తరవాత మూడు నాలుగేళ్ళదాకా రాధను చూడటం పడలేదు. ఆవిడనించి ఉత్తరాలు కూడా లేవు. అప్పుడెప్పుడో ఓసారి రిక్షాలో పోతూపోతూ, సెక్రటేరియట్ దగ్గర ఓ మనిషినిచూసి దేశపాండే అనుకొన్నాను. అంతకుమించి మరేమీ జరగలేదు. అనేకసార్లు రాధ నాకు జ్ఞాపకం వచ్చింది. వచ్చినప్పుడల్లా, కొన్ని ప్రశ్నలు ముందుపడేసి పోతూ ఉండేది. వాటికి సరిపోయిన సమాధానాలు నా దగ్గర లేవు.

ఈ మధ్యనే అనుకోని విధంగా గుంటూరులో కనిపించింది రాధ. చిత్రమేమిటంటే ఈ సారి కూడా ఆవిడే నన్ను ముందుగ్గా చూసి పిలిచింది.

'ఈ సారికూడా నువ్వేముందుగా చూశావు' అన్నాను.

రాధ బలహీనంగా నవ్వింది.

'రండి వెడదాం!' అన్నదావిడ.

ఇంటికి వెళ్ళాలన్న ఉత్సాహం నాలో కలగలేదు. కానీ వెళ్ళాను.

దేశపాండే ఇంట్లోలేడు. ఇద్దరుపిల్లలు వసారాలో ఆడుకొంటున్నారు. నన్నుకుర్చీలో కూర్చోబెట్టి, తను లోపలి

వెళ్ళింది. పిల్లలు 'అమ్మ, అమ్మ' అంటున్నారు. చంటిపిల్ల 'పప్ప' అని దొళ్ళగింతలు పెడుతోంది తల్లి లోపల వెళ్ళడం చూసి.

'వస్తున్నానే తల్లీ !' అంటూనే వచ్చింది రాధ. నాకు కాళ్ళకు నీళ్ళిచ్చింది. తుడుచుకోడానికి తుండుగుడ్డ ఇచ్చింది. ఈ వ్యవధిలో ఏడుస్తున్న పిల్లను చంక కెత్తుకొంది.

'తాతయ్యకు 'నమస్తే' చెప్పమ్మా !' అన్నది రాధ. కూతురు కళ్ళను పమిటతో తుడుస్తూ.

'ఊఁహు' అంటూ తల అడ్డంగా తిప్పిందాపిల్ల. కుర్ర వాడు, చెంగుపట్టు కొని కిందికి దిగలాగు తున్నాడు.

'భోజనానికుండండి. అరగంటలో వంట చేస్తాను' అన్నది రాధ.

'వెడతాను' అన్నాను అప్రయత్నంగా. 'దేశపాండే ఏడీ?'

'కాంపు వెళ్ళారు. ఇంకో వారందాకా రారు' అన్నది రాధ చంటిపిల్లను చంకమార్చు కొంటూ. 'ఈ పిల్లలతో వేగలేకుండా ఉన్నాననుకోండి. క్షణంసేపు కూచోనివ్వరు. మరీ ఈ చంటిముండ అస్తమానం తిండికోసం దేవుళ్ళాడుతుంది. వాళ్ళ నాన్నగారేమో అడిగిందల్లా తెచ్చి పడేస్తారు. అదేత్తంతా తింటుంది. వంటికి తెచ్చుకొంటుంది. చెయ్యలేక, నా దుంప తెగిపోతుంది.'

'ఏ మాత్రం అద్దిస్తూన్నా కేం!' అన్నాను పిల్లలమీది నించి సంభాషణను ఇంటి మీదికి మారుస్తూ.

'మొదట్లో అద్దెకే ఉన్నా మనుకోండి. మొన్ననే కొన్నాం. పదహారు వేలు. కొరిటపాడు దగ్గర నాలుగెకరాల పొలం తీసుకొన్నాం. మరో ఏడాది పోతే, ఇళ్ళ స్థలాల కింద

చెల్లిపోతుంది లెండి. ఇప్పటికే లాభమిస్తాం, అమ్మ మంటూ తిరిగి పోతున్నారు. వారికి అమ్మాలనే ఉంది గానీ, నాకు మాత్రం లేదు' అన్నది రాధ చంటిపిల్లకు పాలుకుడుపుతూ.

'ఎందుకని?'

'కాస్త లాభాని కాశపడి ఇప్పుడే అమ్ముకొంటే మనకేం మిగులుతుందండీ నా బొంద. పిల్లలున్నారు; రేపు బోలెడు ఖర్చులున్నాయి. ఎల్లకాలం ఈ వోపిక లుంటాయంటారా? మరోఏడాది పోతే, ఇబ్బడికి ముబ్బడిగా ధర పలుకుతుంది. ఇప్పుడప్పుడే అమ్ముకోడం దేనికి చెప్పండి?'

'రైటే!' అన్నాను.

ఆ తరవాత అక్కడ ఎక్కువసేపు ఉండలేక పోయాను. రాధను చూస్తుంటే, నాకు ముళ్ళమీద కూచున్నట్టుగా ఉంది. ఊపిరాడక గిజగిజ తన్నుకున్నట్టుగా ఉంది. బయటపడి, నిండుగా గాలి పీల్చాను. రాధ ఉండమనీ, భోంచెయ్యమనీ చాలా బలవంతం చేసింది. 'మరోసారి వస్తాను' అంటూనే వచ్చేశాను.

రాధను గుంటూరులో చూసి, చాలా పొరబాటు చేశానని ఇప్పటికీ నా నమ్మకం. ఆవిడలో నాకు ప్రాణం బొత్తిగా కనిపించలేదు. అన్నిటికీ తలవంచి వంగిపోయి, కీలు బొమ్మలా బ్రతుకుతున్న దనిపించింది. కానీ, ఆవిడ అలా లేదు మరి. జీవితంతో సరిపెట్టుకొంది. సుఖపడుతోంది. సంతోషించదగ్గ సంగతే!

'అయితే నా కెందుకు నచ్చలేదు?'

ఈ ప్రశ్నను చాలాసార్లు వేసుకొన్నాను. రాధకు సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానం దొరకనట్లే,

దీనికి దొరకలేదు. రాధనుండి నేనేదో ఆశించి ఉండాలి. ఏదో అవుతుందని భావించి ఉండాలి. అదేదో నాలో స్పష్టంగా లేదు. అలా కాకపోయేసరికి ఆవిడమీద సానుభూతిని పోగొట్టుకొన్నాను. అగ్ని పర్వతం పేలిపోయిన బద్దలయి జ్వలన ద్రవ్యంతో పరిసరాలను ముంచెత్తి, మారణహోమం చేసి ఉన్నట్లయితే — వేరు సంగతి.

అలా కాకపోవడం రాధ తప్పు కాదనుకొంటాను. లోపలి వ్యక్తిత్వం, అనివార్యంగా విస్తరిల్లి, కాలంతో, భౌతిక శరీరంతో, వయస్సుతో, రక్తంతో పెనుగులాడి, చల్లబడి, ఘనీభవించిపోయిం దిప్పుడు. ఈ ఘనరూపంలో రాధ నిలబడగలిగింది. కానీ ఈ రూపానికి చలనం లేదు. ఊపిరి లేదు. బొమ్మ, ఉత్తి బొమ్మ !!

హఠాత్తుగా నాకు మరో సంగతి గుర్తుకొచ్చింది. 'మీరు' అన్న పదం ముసలితనానికి చిహ్నమని అప్పుడెప్పుడో రాధ అన్నది. ఇంతకాలం, ఆవిడ నలా పిలిచే అవకాశం నాకు దొరకలేదు. ఇప్పుడు వయస్సులోనే కాకుండా, అన్నింటిలోనూ, రాధను, వార్ధక్యం ఆవరించింది. ఇప్పుడావిణ్ని 'మీరు' అనకపోవడం చాలా అన్యాయ మనిపించింది. వెనక్కి తిరిగి 'మీరు — మీరు' అని గట్టిగా అరచిందాకా మనస్సు కుదటపడలేదు. కానీ 'పోయింది, పోయింది' అంటూ మనస్సు సన్నగా గొనుగుతూనే ఉంది. ఏదో పోగొట్టుకొనే ఉంటాను. లేకపోతే నిష్కారణంగా మనస్సలా గొణగదు. కానీ ఏం పోగొట్టుకొన్నానో బోధపడకుండా ఉంది! అదేమిటయి ఉంటుందాని ?